సాక్షి చిత్తూరు

సోమవారం । 12 । ఆగస్టు । 2024



సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హామీ ఇచ్చారు. - 8లో



పచ్చనేతల ఓవరాక్షన్

వి.కోటలో మండల మీట్‌ను టీడీపీ నాయకులు అధికారం అండ చూసుకుని అడ్డుకుని రచ్చ చేశారు. - 8లో



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ మద్దతుదారుడి చెప్పుల దుకాణం దగ్ధం

• వలంటీర్ చిల్లర దుకాణం కూడా బుగ్గి



చెప్పుల దుకాణంలో చెలరేగుతున్న మంటలు

బైరెడ్డిపల్లి: చెప్పుల దుకాణం దగ్ధమై రూ.5లక్షల ఆస్తినష్టం సంభవించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి బైరెడ్డిపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు..వైఎస్సార్ సీపీ మద్దతుదారుడైన నవాబ్‌బాషా స్థానిక చెక్‌పోస్టు కూడలిలో రహదారి పక్కనే చెప్పుల దుకాణం ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నవాబ్‌బాషా, అతని కుమారుడు మోతి వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెప్పుల దుకాణం తొలగించి ఆ స్థలంలో బస్‌షెల్టర్ నిర్మిస్తామని ప్రచారం కూడా జోరుగా సాగింది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి చెప్పుల దుకాణంలో మంటలు చెలరేగి పూర్తిగా కాలి బూడిదైంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారా? షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందా? అనేది తెలియాల్సి ఉంది. అలాగే చెప్పుల దుకాణానికి ఆనుకుని వలంటీర్ రిహానా చిల్లర దుకాణం కూడా అగ్నికి ఆహుతైంది. ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పే వేళకు పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.5లక్షల ఆస్తినష్టం సంభవించిందని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు.

ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ డ్రైవర్ల అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భర్తీ కాని ప్రభుత్వ డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కలెక్టరేట్‌లో విడిది పొందేందుకు ప్రభుత్వ డ్రైవర్లకు స్థలం కేటాయించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రోసన్‌బాషా, అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు, ముఖ్య సలహాదారులు రామన్న, నాయకులు ప్రకాష్, బాలాజీ పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి బుధవారం వరకు రిఫ్రెషర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జెడ్పీ సీఈఓ గ్లోరియా తెలిపారు. పారిశుధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్క్రూటీని, స్ట్రీట్ లైటింగ్ తదితర అంశాలపై శిక్షణ నిర్వహిస్తామన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని చెప్పారు. గైర్హాజరైతే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్ పక్కన ఉన్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తనకు విన్నవించవచ్చని వెల్లడించారు. వినతులు, ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మూతబడిన స్కూల్‌కు కంచె



బడికి కంచె వేసిన దృశ్యం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం 5.వెంకటాపురం గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాల చుట్టూ కంచె వేశారు. పిల్లల చదువుల కోసం స్కూల్ నిర్మించేందుకు కొన్నేళ్ల కిందట ఓ దాత ఈ భూమిని దానం చేశారు. అయితే అక్కడ పిల్లల సంఖ్య తగ్గిపోవడంతో 10 ఏళ్ల కిందట బడి మూతపడింది. అయితే వారం రోజుల కిందట కంచె వేశారు. దీంతో పంచాయతీస్థాయి అధికారులు కంచె తొలగించాలని నోటీసులు ఇచ్చారు. మూడు రోజుల్లో తొలగించాలని, లేనిపక్షంలో తామే జేసీబీలతో తొలగిస్తామని అధికారులు పేర్కొన్నారు.

• తిరుపతికి చెందిన శ్రీనివాసరావు ఆటోనగర్ సమీపంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇసుక ఉచితమని ప్రభుత్వం ప్రకటించింది కదా అని గురువారం ట్రాక్టర్ తీసుకుని పాడిపేట వద్ద స్వర్ణముఖి నదికి వెళ్లారు. అక్కడ ఇసుక తీసుకునేందుకు అనుమతి లేదని స్థానికులు చెప్పారు. దీంతో ఇసుక అనుమతి కోసం తిరుపతి, రేణిగుంట తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లారు. వెంకటగిరి లేదా నాగాలాపురం, పిచ్చాటూరు మండలాల్లోని అధికారిక రీచ్‌లకు వెళ్లాలని అధికారులు స్పష్టం చేశారు. దీంతో చేసేది లేక శుక్రవారం ఉదయం ముందుగా వెంకటగిరి మండలం మోగళ్లగుంటలోని రీచ్‌కు కారులో చేరుకున్నారు. అక్కడ ఇసుక నిల్వ లేకపోవడంతో దొరవారిసత్రం మండలం మావిళ్లపాడులోని ఇసుక రీచ్‌కు వెళితే మళ్లీ నిరాశే ఎదురైంది. దీంతో ఉసూరుమంటూ నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగకు చేరుకున్నా అక్కడా ఇసుక లేదు. ఇక మిగిలిన పిచ్చాటూరు మండలం అడవికోయంబేడు రీచ్‌కు వెళితే ఇసుకైతే ఉంది కానీ.. డంప్ యార్డు వద్ద అధికారులెవ్వరూ లేరు. కాపలాగా ఓ కానిస్టేబుల్ ఉన్నారు. ఇసుక కోసం వచ్చిన సుమారు 100 టిప్పర్లు ఉదయం నుంచి వేచి ఉన్నాయి. రాత్రి వరకు ఎదురుచూసి తిరిగి తిరుపతికి వచ్చేశారు. శ్రీనివాసరావు తన కారుకి రూ.2,500 పెట్రోల్ పట్టుకుని రోజంతా సుమారు 350 కిలోమీటర్లు ప్రయాణించి తిప్పలు పడినా చివరకు ఇసుక దొరకలేదు.

• కుప్పం పట్టణానికి చెందిన మురుగప్ప అసంపూర్తిగా నిలిచిపోయిన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకునేందుకు అప్పుచేశాడు. ఈనెల 9వ తేదీన పనులు ప్రారంభించాడు. నిర్మాణ పనుల కోసం ఇసుక తెచ్చుకునేందుకు ప్రయత్నించాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్కారు ఏర్పాటు చేసిన రీచ్‌ల వద్దే ఇసుక కొనుగోలు చేయాలి అని అధికారులు స్పష్టం చేశారు. కుప్పానికి సమీపంలో ఇసుక తెచ్చుకునేందుకు అనుమతులు లేవని తెగేసి చెప్పారు. దీంతో సుమారు 100 కిలోమీటర్ల దూరంలోని గంగవరం మండలం నాలుగురోడ్ల కూడలి వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌కు వెళ్లాడు. తీరా అక్కడ రీచ్‌లో ఇసుక లేదు. తిరిగి వంద కిలోమీటర్లు ప్రయాణం చేసి ఉట్టి చేతులతో ఇంటికి వచ్చేశాడు. చివరకు చేసేది లేక కుప్పం సమీపంలో తయారుచేసే కృత్రిమ ఇసుకను అధిక ధరకు కొనుగోలు చేసుకుని నిర్మాణ పనులు ప్రారంభించుకున్నాడు.

• శ్రీకాళహస్తికి చెందిన రమేష్‌బాబు స్వగృహ నిర్మాణం చేపట్టాడు. పట్టణానికి సమీపంలోని విరూపాక్షిపురం, పెన్నలపాడులో ఇసుక దొరుకుతుందని తెలుసుకుని అక్కడికి చేరుకున్నాడు. టిప్పర్ ఇసుక తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. వెంటనే అక్కడున్న టీడీపీ నేతల అనుచరులు అడ్డుకున్నారు. 'మీరంతా నదిలో యంత్రాలతో తవ్వి ఇసుక తరలిస్తున్నారు కదా.' అని రమేష్‌బాబు ప్రశ్నించడంతో కొట్టినంత పనిచేశారు. మరి ఇసుక కావాలంటే ఏం చేయాలని అడిగితే టిప్పర్ ఇసుకకు రూ.25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తాము అడిగినంత సొమ్ము ఇస్తే ఇసుకను ఇంటికే చేరుస్తామని స్పష్టం చేశారు. ఇసుక ఉచితమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు కదా అని రమేష్‌బాబు అడిగితే.. అదంతా తమకు తెలియదని, నగదు కడితేనే ఇసుక పంపుతామని తేల్చిచెప్పారు. అక్కడి నుంచి పలువురికి ఫోన్‌చేసి ఇసుక గురించి ఆరా తీసినా ఎక్కడా ఉచిత ఇసుక దొరకదని, టీడీపీ వాళ్లే విక్రయిస్తున్నారని తెలియడంతో చేసేదిలేక రమేష్‌బాబు రూ.25వేలు చెల్లించి టిప్పర్ ఇసుక కొనుగోలు చేసుకున్నాడు.



యథేచ్ఛగా ట్రాక్టర్లతో ఇసుక తరలింపు



శ్రీకాళహస్తి సమీపంలోని స్వర్ణముఖి నదిలో యంత్రాలతో అక్రమంగా ఇసుకను తవ్వి వాహనాలకు నింపుతున్న దృశ్యం

ఉచితం కాదు.. అనుచితం

"మీ ఊరి దగ్గర వాగు ఉందా..? కాలువ ఉందా..? నది ఉందా..? అక్కడకు వెళ్లి తట్టలతో తెచ్చుకుంటారో.. ఎద్దుల బండిలో తెచ్చుకుంటారో.. కావాల్సినంత ఇసుకను ఉచితంగా తీసుకెళ్లండి.. ఎవరు వద్దంటారు..? పైసా చెల్లించాల్సిన అవసరం కూడా లేదు.'' అని చాలా తేలిగ్గా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించేశారు. అంతలోనే బండిలో ఇసుక తరలించడం నిషేధం అంటూ ప్లేటు మార్చేశారు. ఎప్పటికప్పుడు ఉచిత ఇసుక అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారు. దిగితే కానీ లోతు తెలియదు అన్నట్టు.. ఇసుక కోసం వెళ్లిన వారికే లోగుట్టు తెలుస్తోంది. ఉచితం పేరిట టీడీపీ నేతల అనుచిత వైఖరి అర్థమవుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీచ్‌లలో మాత్రం ఇసుక రేణువు కూడా ఉండదు. అదే పచ్చ మూక అనధికారికంగా పాగా వేసిన పాయింట్లలో మాత్రం కావాల్సినంత ఉంటుంది. అక్కడ వాళ్లు చెప్పిందే రేటు.. అడిగినంత చెల్లిస్తేనే పనవుతుంది. ఉచిత ఇసుక అంటూ ఊదరగొడుతూ జనం చెవిలో పువ్వులు పెడుతున్న కూటమి సర్కారు నాటకాలపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్.

ఇసుక పేరుతో పచ్చ మోసం

- అధికారిక ఇసుక రీచ్‌లు ఏడింటికి గాను మూడింటిలో నిల్వలు నిల్
- అక్కడ కూడా వినియోగదారుల నుంచి అదనపు వసూళ్లు
- అనధికార పాయింట్లు ఏర్పాటు చేసుకుని టీడీపీ నేతల దందా
- నదులు.. ప్రైవేట్.. సర్కారు భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- భారీ ధరలకు విక్రయిస్తూ జనం నడ్డివిరగ్గొడుతున్న తెలుగు తమ్ముళ్లు
- పొరుగు రాష్ట్రాలకు సైతం అక్రమంగా తరలింపు
- అధికారులతో కుమ్మక్కై యథేచ్ఛగా దోపిడీ

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ప్రభుత్వం ఏడు ఇసుక రీచ్‌లను అధికారికంగా ఏర్పాటు చేసింది. అయితే వాటిలో కేవలం మూడు రీచ్‌లలో మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. తిరుపతి జిల్లా పిచ్చాటూరు అడవికోయంబేడు, చిత్తూరు జిల్లా గంగవరం మండలం నాలుగురోడ్ల కూడలి, చిత్తూరు రూరల్ మండలం దిగువమాసపల్లె, పాలూరులో మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయి. మిగిలిన నాలుగు రీచ్‌లలో ఇసుక డంప్‌లు లేవు. ప్రభుత్వం ఉచితమంటూ ప్రకటించిన రెండు రోజులు మాత్రమే ఇక్కడ ఇసుక డంప్‌చేశారు. తర్వాత ఖాళీ అయిన రీచ్‌లలో ఇసుకను మళ్లీ డంప్ చేయలేదు.

వెలుగులోకి మరో మోసం

ఇసుక ఉన్న రీచ్‌ల వద్ద అధికారులు, టీడీపీ నేతలు లాలూచీ పడి ఎవరికీ అనుమానం రాకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు. 10 టన్నులకు చలానా కట్టి టిప్పర్‌లో 15 టన్నులు ఇసుక నింపి సొమ్ముచేసుకుంటున్నారు. అలాగే 4 టన్నులకు రశీదు వేసి ట్రాక్టర్‌లో 5 టన్నుల ఇసుకను తరలించి జేబులు నింపుకుంటున్నారు.

అడిగినంత చెల్లిస్తేనే..

ప్రస్తుతం మూడు రీచ్‌లలో ఉన్న ఇసుక కోసం వెళ్లిన వినియోగ దారులకు నిర్వాహకుల నుంచి చేదు అనుభవం ఎదురవుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం టన్ను ఇసుక రూ.155 లెక్కన ట్రాక్టర్ (ఐదు టన్నులు)రూ.775 అవుతుంది. బాడుగ 0–10 కిలోమీటర్ల అయితే రూ.1,200. అదే టిప్పర్ ఇసుక అయితే రూ.1,550. దూరం పెరిగే కొద్దీ వాహనం బాడుగ పెరుగుతుంది. ఇదిలా ఉంచితే.. టీడీపీ నేతలు ఒక వాహనానికి అదనంగా రూ.3వేలు వసూలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని అధికారులతో కలిసి వాటాలు పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. పిచ్చాటూరు మండలం అడవికోయంబేడులో అదనపు వసూళ్లకు పాల్పడడంతో వినియోగదారులు నిలదీశారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలోనే అధికారులు శుక్రవారం ఇసుకను విక్రయాలు నిలిపివేసినట్లు సమాచారం. ఫలితంగా వందలాది వాహనాలు రోజంతా వేచి ఉండాల్సి వచ్చింది.

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ఇసుక రీచ్‌లు

మండలం	ప్రాంతం
వెంకటగిరి	మొగళ్లపాడు
దొరవారిసత్రం	మావిళ్లపాడు
నాగలాపురం	సుబ్బానాయుడుకండ్రిగ
పిచ్చాటూరు	అడవికోయంబేడు
చిత్తూరు రూరల్	దిగువమాసాపల్లె, పాలూరు
గంగవరం	నాలుగురోడ్ల కూడలి

రెండు వారాలుగా నిల్వలు లేనివి

వెంకటగిరి	మొగళ్లపాడు
దొరవారిసత్రం	మావిళ్లపాడు
నాగలాపురం	సుబ్బానాయుడు కండ్రిగ
గంగవరం	నాలుగురోడ్ల కూడలి



గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలి వద్ద రీచ్‌లో ఇసుక లేని దృశ్యం



దొరవారి సత్రం మండలం మావిళ్లపాడు వద్ద ఇసుక నిల్వ లేని అధికారిక రీచ్

ఊరూరా అక్రమ రీచ్‌లు!



పిచ్చాటూరు మండలం అడవికోయంబేడు రీచ్‌లో ఇసుక నింపకపోవడంతో బారులు తీరిన వాహనాలు



పాడిపేట వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలకు వచ్చిన టీడీపీ వారిని అడ్డుకున్న స్థానికులు(ఫైల్)

ప్రభుత్వ రీచ్‌లలో ఇసుక లేకుండా చేసి.. కూటమి నేతలు సొంతంగా ఇసుక పాయింట్లు ఏర్పాటు చేసుకున్నారు. చంద్రగిరి నుంచి నాయుడుపేట వరకు స్వర్ణముఖి నదీ తీరంలో టీడీపీ నేతల అనధికారికంగా రీచ్‌లే కనిపిస్తున్నాయి. భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. కంటైనర్ల ద్వారా చెన్నై, బెంగుళూరుకు తరలించి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. మరో వైపు రైతులను బెదిరించి వారి భూముల్లోని ఇసుకను సైతం తవ్వేసి విక్రయించేస్తున్నారు. శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజక వర్గాల పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టారు. రెండు రోజుల క్రితం తిరుపతి రూరల్ మండలం పాడిపేట వద్ద, ఏర్పేడు మండలం పెనుమల్లం వద్ద వెలుగుచూసిన టీడీపీ నేతల బాగోతమే ఇందుకు నిదర్శనం. డీకేటీ పట్టాలు పొందిన రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో టీడీపీ నేతలు దౌర్జన్యంగా భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి వందలాది వాహనాల ద్వారా తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. అదే విధంగా శ్రీకాళహస్తి మండల పరిధిలోనూ ఇదే తరహాలో అక్రమాలు జరుగుతున్నాయి. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.5వేల నుంచి రూ.7వేలకు విక్రయించి డబ్బులు పోగేసుకుంటున్నారు. టిప్పర్ అయితే రూ.25వేల నుంచి రూ.36వేలకు విక్రయించేస్తున్నారు. చెన్నై, బెంగుళూరు లాంటి ప్రాంతాలకు అయితే లోడ్ ఇసుక రూ.లక్షపైనే ఉంటుందని అంచనా.

తమ్ముళ్లవైతే కేసే లేదు!

టీడీపీకి చెందిన వారు ఎక్కడైనా ఇసుకను తవ్వి తరలించుకెళ్లినా అధికారులు పట్టించుకోరు. ఇంకొకరు చలానా కట్టి ఇసుక తీసుకెళుతున్నా కేసులు తప్పవు. శ్రీకాళహస్తి పరిధిలో ఓ వ్యక్తి రూ.1,200 చెల్లించి ట్రాక్టర్ ఇసుక తీసుకెళుతుంటే పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో టీడీపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు పైసా కట్టకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ పట్టుబడ్డారు. ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత ఒకరు పోలీసులకు ఫోన్ చేయటంతో తెలుగు తమ్ముళ్లను మాత్రం రాచమర్యాదలు చేసి విడిచిపెట్టేశారు. ప్రభుత్వానికి నగదు చెల్లించి ఇసుక తరలించిన వ్యక్తిపై మాత్రం కేసు నమోదు చేసి ట్రాక్టర్ సీజ్ చేయడం గమనార్హం.



ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లు



తట్టలతో ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు

రాచ'మార్గం'లో..

అక్రమార్జన కోసం టీడీపీ నేతల కుయుక్తులు అన్నీ ఇన్నీ కావు. ఇసుక తవ్వకాల కోసం ఏకంగా స్వర్ణముఖి నదిలోకి పలు ప్రాంతాల్లో రహదారులు ఏర్పాటు చేసేశారు. నేరుగా నది మధ్యలోకే వెళ్లేలా దారులు వేసేశారు. ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు సులువుగా సజావుగా బయటకు వచ్చేలా ఆయా మార్గాలను రూపొందించారు. ఈ క్రమంలోనే యంత్రాలు అందుబాటులోని చోట్ల ఇసుక లోడ్ చేసేందుకు కూలీలను వినియోగిస్తున్నారు. ఒక్కో వాహనానికి ఇంత అని కూలి చెల్లించి.. అది కూడా ఇసుక కొనుగోలు చేసేవారిపైనే భారం మోపుతున్నారు. ఏది ఏమైనా కాసులు మూట గట్టుకోవడమే లక్ష్యంగా నదీమతల్లికి గర్భశోకం కలిగిస్తున్నారు.



స్వర్ణముఖి నదిలోకి వేసిన దారి

'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయండి

• కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా షెడ్యూల్ మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈ నెల 12వ తేదీ నుంచి 15 వరకు హర్ ఘర్ తరంగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ నెల 12వ తేదీన జాతీయ జెండాలతో సెల్ఫీ తీసుకుని harghartiranga.com లో పోస్ట్ చేయాలన్నారు. స్కూళ్లు, కళాశాలల్లో దేశభక్తికి సంబంధించిన పాటలు, డ్రామాలు, మోనో యాక్షన్ తదితర కార్యక్రమాలను డీఈఓ, డీవీఈఓ నిర్వహించాలని ఆదేశించారు. 13వ తేదీన హర్ ఘర్ తిరంగాకు సంబంధించి జిల్లావ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ర్యాలీ నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియను డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. బిక్ రన్ మారథాన్‌ను డీఎస్‌డీఓ, ఆర్‌ఐఓ, డీఈఓలు సమన్వయంగా నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేయాలని చెప్పారు. ఈ నెల 14న జిల్లా, మండల, గ్రామ, వార్డు అధికారులతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహణను అర్బన్ పరిధిలో కమిషనర్లు, పంచాయతీ స్థాయిలో డీపీఓ పర్యవేక్షించాలన్నారు. ఈ నెల 15వ తేదీన జిల్లాలోని అన్ని పాఠశాలల్లో, కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగుర వేయాలని కలెక్టర్ తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

సర్దుబాటు ప్రక్రియలో మార్పులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటుకు సంబంధించి మార్పుల ఉత్తర్వుల జాబితాను రాష్ట్ర ఉన్నతాధికారులు విడుదల చేశారు. ఆ ఉత్తర్వులు ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారులకు చేరాయి. అందులో పాఠశాలల్లో జూనియర్ కేడర్‌ను సర్‌ప్లస్‌గా గుర్తిస్తారు. ఆగస్టు 9 నాటి యూడైస్ విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని సర్దుబాటు ప్రక్రియ నిర్వహిస్తారు. ఆగస్టు 12 నుంచి ఆగస్టు 14 మధ్యలో సర్దుబాటు ప్రక్రియను చేపడతారన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అనైతికం

చిత్తూరు అర్బన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడి ఓ అనైతిక చర్య అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు పార్లమెంటరీ లీగల్ విభాగం అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అంబేడ్కర్‌ను.. టీడీపీ నేతలు ఓ పార్టీకి పరిమితం చేశారని మండిపడ్డారు. విజయవాడలో సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన విగ్రహాన్ని కూల్చాలని చూడడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. పోలీసుశాఖ కూడా ఈ దాడి పట్ల మౌనం వహించడం అంబేడ్కర్‌ను అవమానించడమేనన్నారు. ఇప్పటికైనా నిందితులను అరెస్టు చేయాలని, లేదంటే న్యాయవాదులతో కలిసి ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

–కిటకిటలాడిన బోయకొండ పుణ్యక్షేత్రం



చౌడేపల్లె : జిల్లాలో రెండో పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, పశు, జంతు సంపద వృద్ధి చెందేలా ఆశీర్వదించు తల్లీ గంగమ్మా అంటూ స్థానిక గ్రామీణ ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయంలో రద్దీ పెరగడంతో క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు వెలిగించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

13 నుంచి స్టాఫ్ నర్సులకు కౌన్సెలింగ్

కాణిపాకం: కడప వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు గతేడాది స్టాఫ్ నర్సుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 13 నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 206 పోస్టులకు గాను మెరిట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ ఎంపిక జాబితా తయారు చేయడం జరిగిందన్నారు. ఈ జాబితా ప్రకారం ఈనెల 13, 14, 16, 17 తేదీల్లో రోజుకు 50 మందికి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు వైద్య ఆరోగ్యశాఖ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

మొరాయిస్తున్న సర్వర్

ప్రభుత్వానికి ఆదాయం వచ్చే వాటిలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి. అయితే ఇటీవల రిజిస్ట్రేషన్‌శాఖకు సంబంధించిన సర్వర్ మొరాయిస్తుండడంతో కొనుగోలు, విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద జనం పడిగాపులు కాస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా తగ్గింది. సర్వర్ సమస్య రాకుండా చూడాలని క్రయ, విక్రయదారులు కోరుతున్నారు.

- ఉన్నఫళంగా డౌన్ అవుతున్న మెయిన్, పీడీఈ సర్వర్లు
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద జనం పడిగాపులు
- సర్వర్ సరిగా రాక ఆగిపోతున్న రిజిస్ట్రేషన్లు
- భూముల రిజిస్ట్రేషన్ కోసం విక్రయ, కొనుగోలుదారుల అవస్థలు



చిత్తూరులో రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న క్రయ, విక్రయదారులు (ఫైల్)

చిత్తూరు కార్పొరేషన్: జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద జనం భారీగా కనిపిస్తున్నారు. అంతటా రిజిస్ట్రేషన్‌శాఖకు సంబంధించి మెయిన్, పీడీఈ సర్వర్ మొరాయిస్తోంది. ప్రసుత్తం ప్రతి ఒక్కరూ భూముల కొనుగోలు, అమ్మకాలపైనే పెట్టుబడులు పెడుతున్నారు. పేద, మధ్య, ధనిక వర్గాలు అవసరం, సౌకర్యం, వ్యాపార పరంగా భూములు, ఇళ్లు, ఇతర ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ప్రతిదానికి ఇప్పుడు చట్టభద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వినియోగదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. తరచూ సర్వర్ డౌన్ అవుతుండడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో అటు అధికారులు.. ఇటు క్రయ, విక్రయదారులు తలలు పట్టుకుంటున్నారు. ఫలితంగా ఆస్తుల క్రయ, విక్రయాలు నిలిచిపోతున్నాయని అమ్మకం, కోనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో రోజూ దాదాపు 300 పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. తద్వారా ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. అయితే అనుకోకుండా ఒక్కోసారి రిజిస్ట్రేషన్ మెయిన్ సర్వర్ డౌన్ అవుతోంది. ఒక్కోసారి రెండు, మూడు రోజుల వరకు కూడా పునరుద్ధరణ కావడం లేదు. కొన్నిసార్లు గంటల వ్యవధిలోనే సర్వర్ పునరుద్ధరణ జరిగినా, స్పీడ్ లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరగడం లేదు. గత నెల రోజుల్లో ఇలా దాదాపు వారం రోజులకు పైగా సర్వర్ సక్రమంగా పని చేయలేదు.

మొరాయిస్తున్న పీడీఈ సర్వర్..

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పబ్లిక్ డేటా ఎంట్రీ ప్రధానం. ఇందుకోసం స్వయంగా రిజిస్ట్రేషన్ దారులే తమ వివరాలను సర్వర్‌లోకి వెళ్లి నమోదు చేయాల్సి ఉంటుంది. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని లాగిన్ అయి వివరాలను నమోదు చేసుకుని టైమ్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. అయితే ఈ సర్వర్ తరచూ సతాయిస్తుండడంతో క్రయ, విక్రయదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒక్క పీడీఈ డాక్యుమెంట్ కోసం ఒక్కోసారి రెండు, మూడు రోజుల సమయం కూడా పడుతోంది.

పనులన్నీ పక్కన పెట్టి..

రిజిస్ట్రేషన్ల కోసం క్రయ, విక్రయదారులకు ఆన్‌లైన్ సర్వర్ పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్రమంగా సాగితే రెండు, మూడు గంటల్లో పూర్తవుతుంది. అయితే సర్వర్ సరిగా పని చేయకపోవడంతో రెండు, మూడు రోజుల పాటు పనులన్నీ మానుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యవసాయ పనులు ఉన్న రైతులు పనులను వదులుకోవాల్సి వస్తోంది. అయితే సర్వర్ సమస్య తరచూ ఉత్పన్నం అవుతున్నా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు నివేదించాం..



ఎక్కువగా ఆధార్ సర్వర్ డౌన్ అవుతోంది. గత నెలలో మెయిన్ సర్వర్ సమస్య అందరినీ వేధించింది. కార్యాలయాలకు వచ్చిన వారిని వేగంగా పనులు చేసి పంపాలని ఉద్యోగులను ఆదేశించం. ప్రస్తుతం ఆ సమస్య లేదు. ఎప్పటికప్పుడు సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. అయితే కొద్ది రోజులు స్పీడ్ లేకపోవడంతో తక్కువ సంఖ్యలో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయింది. మళ్లీ పుంజుకుంది.

– శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్

షూటింగ్‌బాల్ పోటీ విజేత

జిల్లా బాలుర జట్టు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జిల్లా అధికారులు



పతకాలు సాధించిన విద్యార్థులతో పీఈటీ లోకనాథం

వి.కోట: రెండు రోజుల పాటు వి.కోట బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్ జిల్లాల చాంపియన్ షిప్ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు విజేత నిలిచింది. షూటింగ్ బాల్ పోటీల్లో 16 జిల్లాల నుంచి 32 జట్లు బాల,బాలికలతో కూడిన జట్లు పాల్గొన్నాయి. ఈపోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. ఆదివారం సాయంత్రం పోటీలు ముగియగా ఇందులో బాలుర విభాగంలో చిత్తూరు జట్టు మొదటి స్థానంలో నిలువగా, ద్వితీయస్థానంలో పల్నాడు జిల్లా జట్టు, అన్నమయ్య జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. అలాగే బాలికల విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు మొదటి స్థానంలో, అన్నమయ్య జిల్లా జట్టు ద్వితీయస్థానం, చిత్తూరు జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచాయి. విజేతలకు జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ చైర్మన్ డాక్టర్ మహేష్, అధ్యక్షుడు డాక్టర్ పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అలాగే క్రీడాకారులకు మండలానికి చెందిన కిరణ్ ఫౌండేషన్ అధినేత కోట్ల కిరణ్‌కుమార్ రెడ్డి భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వేణుగోపాల్, లోకనాథం, జబ్బీర్, స్వాతి, సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చందం స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కుప్పంరూరల్: సబ్ జూనియర్స్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో కుప్పం మండలం, చందం ఉన్నత పాఠశాలకు చెందిన భానుతేజ బంగారు పతకం సాధించినట్లు హెచ్‌ఎం మార్కొండనాయుడు తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న భానుతేజ బంగారు పతకం సాధించగా, షూటింగ్ బాల్ బాలికల విభాగంలో 10వ తరగతి చదువుతున్న శకుంతల, జయశ్రీలు కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథంకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు పతకాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుడికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్
- చిన్నస్వామి మృతిపై అనుమానాలు ఉన్నాయంటున్న నేతలు

పలమనేరు: మండలంలోని మాదిగబండ క్వారీలో ఆదివారం అనుమానాస్పదంగా మృతిచెందిన చిన్నస్వామి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల నష్టపరిహారాన్ని అందించాలని మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు బాలాజీనాయుడు, ప్రహ్లాద తదితరులు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మండల పార్టీ శ్రేణులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగబండ వద్ద జనార్ధన నాయుడు క్వారీని అక్రమంగా నిర్వహిస్తున్నాడని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక క్వారీని ఆక్రమించుకుని అక్కడ ఉన్న కూలీలకు జీతాలు ఇవ్వకుండా వేధిస్తూ పనులు చేయిస్తున్నాడని ఆరోపించారు. చిన్నస్వామి అనే ఆపరేటర్‌కు సైతం మూడు నెలలుగా జీతం ఇవ్వలేదని తెలిసిందన్నారు. దీంతో ఆపరేటర్ గట్టిగా మాట్లాడినందుకే జేసీబీతో కొట్టి చంపారనే అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జనార్ధన్ నాయుడు ఆక్రమించుకున్న క్వారీ పరిమితి ముగిసిందని, దీంతో స్థానిక మైనింగ్ అధికారులు ఆయనకు నోటీసులు సైతం జారీ చేశారన్నారు. కానీ ఆయన అధికారం ఉందనే ధైర్యంతో నిరాటంకంగా జల్లి పనులు చేయిస్తున్నాడని ఆరోపించారు. క్వారీ అసలు యజమాని శరత్‌కుమార్ సైతం కరెంట్ బకాయిలు చెల్లించలేమని, ఇకపై క్వారీకి కరెంట్ వద్దని స్థానిక ట్రాన్స్‌కో వారికి వినతిపత్రం ఇచ్చారన్నారు. కానీ అక్కడ అక్రమంగా క్వారీ నిర్వహణలో ఉందని, వారి నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీని సీజ్ చేసి మృతుని కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు విశ్వనాథ రెడ్డి, చెంగారెడ్డి, గిరిరాజారెడ్డి, రాజారెడ్డి, పలువురు సర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై టీడీపీ నేతల బెదిరింపులు

- బోడబండ్ల గ్రామ సంఘమిత్రలు, వీవో లీడర్ల రాజీనామా
- ప్రభుత్వ పథకాలు రానివ్వమని టీడీపీ నేతల బెదిరింపులు
- రాజీనామా పత్రాలను అందజేసిన వైనం



వెలుగు సీసీ ప్రభావతికి రాజీనామా లేఖలు అందజేస్తున్న బోడబండ్ల-1 సంఘమిత్ర, వీవో లీడర్లు

బంగారుపాళెం: అన్నిశాఖల్లో తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు టీడీపీ నాయకులు పావులు కదుపుతున్నారు. వెలుగులో పని చేసే చిన్నస్థాయి ఉద్యోగులపై రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. మాట వినని వారిపై బెదిరింపులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. మండలంలోని బోడబండ్ల గ్రామ పంచాయతీలోని ఆదివారం సంఘమిత్రలు, వీవో లీడర్లు రాజీనామా చేశారు. వెలుగు సీసీ ప్రభావతి ఆదివారం బోడబండ్ల గ్రామంలో మీటింగ్ ఏర్పాటు చేయగా, స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు మేరకు బోడబండ్ల-1 సంఘమిత్ర రాజేష్, బోడబండ్ల-2 సంఘమిత్ర ధనమ్మ రాజీనామా పత్రాలను సీసీకి సమర్పించారు. సంఘమిత్రలు రాజీనామా చేయడంతో బోడబండ్ల-1 వీవో అధ్యక్షురాలు వసంతమ్మ, కార్యదర్శి కామాక్షి, కోశాధికారి రజిని, బోడబండ్ల-2 వీవో అధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శి సరస్వతి, కోశాధికారి తులసి స్థానిక సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ హరిబాబు సమక్షంలో తమ పదవులకు రాజీనామా చేశారు. వీవో పుస్తకాలు, బ్యాంక్ చెక్‌బుక్స్, ట్యాబ్స్ తదితర సామగ్రిని సీసీకి అప్పగించి సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన సంఘమిత్రలు, వీవో లీడర్లు మాట్లాడుతూ పంచాయతీకి చెందిన తెలుగుదేశం నాయకులు తమ ఇళ్ల వద్దకు వచ్చి రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేశారని తెలిపారు. అలా చేయకుంటే ప్రభుత్వ పథకాలు రాకుండా చేస్తామని బెదిరించారని వాపోయారు.

గంజాయి తరలిస్తుండగా..



నిందితుల అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: విక్రయించేందుకు తీసుకెళ్తున్న మూడు కేజీల గంజాయిని పట్టుకోవడంతో పాటు ఇద్దరు వ్యక్తులను ఆదివారం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. బండపల్లి-చిత్తూరుకు వెళ్లే మార్గంలో గంజాయి విక్రయదారులు బైక్‌పై వెళ్తుండగా, పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. ఆపకుండా పారిపోవడంతో పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేశారు. వారి వద్ద మూడు కేజీల గంజాయి పట్టుబడింది. వారు రూ.10 వేలకు గంజాయి కొనుగోలు చేసి, చిన్నచిన్న ప్యాకెట్లు చేసి రూ.75 వేలకు అమ్ముతున్నట్లు గుర్తించారు. గంజాయితో పాటు బైక్, మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు చిత్తూరుకు చెందిన మదన్(26), మనోజ్(23)గా తెలిసింది. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ జయరామయ్య, ఎస్‌ఐ సుమన్, సురేష్, జనార్ధన్, సుధాకర్, సుదర్శన్, సుల్తాన్ తదితరులు ఉన్నారు.

అధికార అండతో పచ్చనేతల ఓవరాక్షన్

- సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకున్న టీడీపీ నేతలు
- ప్రజా ప్రతినిధులు, అధికారులను బయటకు పంపి..
- కవరేజీకి వెళ్లిన మీడియాపైనా అక్కసు
- వి.కోటలో తీవ్ర ఉద్రిక్తత

వి.కోట: అధికార బలంతో మండలంలో పచ్చనేతలు రెచ్చిపోతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని వి.కోటలో పచ్చనేతలు అడ్డుకుని అధికారులను, ప్రజాప్రతినిధులను బయటకు పంపారు. ఆదివారం మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ యువరాజు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. అయితే టీడీపీ నాయకులు ఈ మండల మీట్‌ను అడ్డుకోవడంతో అక్కడ ఘర్షణ వాతావరణం చెలరేగింది. ఘటనపై ఫొటోలు, వీడియోలు తీస్తున్న మీడియా వారిపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. ఫొటోలు, వీడియోలు తీయొద్దంటూ హెచ్చరించారు. దీంతో అరుపులు, కేకలతో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎంపీపీ యువరాజ్‌ను ఎంపీపీ పదవికి రాజీనామా చేయాలని రచ్చ చేశారు. పోలీసులు రావడంతో సద్దుమణిగింది. సమావేశం జరగకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు వెనుదిరిగారు. శాంతియుతంగా ఉండే వి.కోటలో టీడీపీ నాయకులు ఘర్షణ వాతావరణం కల్పిస్తుండడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ



విచారిస్తున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

యాదమరి : పాత కక్షలను మనసులో పెట్టుకుని కొందరు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకుడు తలపులపల్లి బాబు రెడ్డి కుమారుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. గత ఆదివారం పూతలపట్టు మండలంలోని పోటుకనుమ, తలపులపల్లి గ్రామాలకు చెందిన కొందరు యువకులు గొడవ పడ్డారు. అనంతరం తలపులపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు కొడుకు వద్దకు గొడవ సర్దుబాటు కోసం ఇరుపక్షాల వారు వచ్చారు. అక్కడ గొడవ సద్దుమణగడంతో ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే కొందరు టీడీపీ నాయకులు పాత కక్షలను మనసులో పెట్టుకుని పోటుకనుమకు చెందిన తరుణ్ రెడ్డి, లోకనాథరెడ్డి, జ్యోతిరెడ్డి కులం పేరుతో తమను దూషించారని గత ఆదివారం రాత్రి పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా చందుతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారు. రెండు రోజుల క్రితం పోలీసులు తరుణ్ రెడ్డిపై కేసు నమోదు చేయగా, ఆదివారం డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఘటనపై సాక్షులను విచారించారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం



మృతి చెందిన చంద్రమ్మ

తవణంపల్లె: మండలంలోని కె.పట్నం సమీపంలో ఆదివారం సాయంత్రం హైవే రోడ్డులో వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో మహిళ దుర్మరణం చెందింది. పోలీసుల కథనం మేరకు.. ఐరాల మండలం రెడ్డివారిపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి, చంద్రమ్మ (45) దంపతులు బైక్‌లో చిత్తూరు నుంచి తిరుపతి-బెంగళూరు హైవే రోడ్డుపై వస్తుండగా సర్వీసు రోడ్డు నుంచి హైవేలోకి వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో చంద్రమ్మ అక్కడికక్కడే మృతి చెందగా సుధాకర్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక ఎస్‌హెచ్‌ఓ అమీర్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హైవేలో వాహనాలు అతివేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు దృష్టి పెట్టాలని ప్రమాదాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

చదరంగానికి జీవితంతో దగ్గర సంబంధం



విజేతలతో డిప్యూటీ డీఈవో, లయన్స్‌క్లబ్, చెస్ అసోసియేషన్ సభ్యులు

నగరి : చదరంగానికి జీవితంతో దగ్గర సంబంధం ఉందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్, డిప్యూటీ డీఈవో ప్రభాకర్ రాజు తెలిపారు. ఆయన ఆదివారం నగరి మండలలోని వీకేఆర్ పురం గ్రాండ్ వరల్డ్‌లో ఆదివారం చిత్తూరు జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాల చెస్ పోటీల ఫైనల్స్, బహుమతుల పంపిణీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో 150 మంది పాల్గొనగా సీనియర్స్ విభాగంలో హేమాద్రి(విజయపురం, బూచివానత్తం), జలీల్(నగరి), శ్యామ్‌కుమార్ (శ్రీకాళహస్తి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. జూనియర్స్ విభాగంలో తిరుపతికి చెందిన మన్యుసాయి, లక్షిత్ కుమార్, వెంకటగణేశ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. అండర్-9 విభాగంలో తిరుపతికి చెందిన ఆద్విక్, వెంకటహర్షిత్, అర్నా, అండర్ 7 విభాగంలో తిరుపతికి చెందిన కుషాల్‌కుమార్, కార్తికేయన్ వినోద్‌కుమార్, జైయిన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. పోటీలో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ చదరంగం పోటీలు మనిషి మేధస్సుకు పదును పెడతాయన్నారు. జీవితంలో ప్రతి చోటా, ప్రతి సందర్భంలోనూ వ్యూహాలు వేయడానికి మనిషికి మేధస్సు ఎంతో అవసరమని, ఆ శక్తిని చదరంగం ద్వారా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రాజరాజేశ్వరి, కార్యదర్శి డాక్టర్ మంజుల, ట్రెజరర్ ఎం.పుష్పలత, కోఆర్డినేటర్ ఎ.మోహన్, ఉపాధ్యక్షులు గజేంద్ర, సభ్యులు దేవన్, జీవన్, సీనియర్ చెస్ శిక్షకుడు నవీన్‌కుమార్, నగరి చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఖలీల్‌బాషా, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం

- ఎస్టీయూ నేతలతో కలెక్టర్ భేటీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఎస్టీయూ నేతలకు హామీ ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఇటీవల ఎస్టీయూ సంఘ నాయకులు ఈ నెల 12న జెడ్పీ ఎదుట మహాధర్నా నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్‌లో ఎస్టీయూ నేతలతో సమస్యల పరిష్కారంపై సమావేశం నిర్వహించారు. ఆ సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ జీపీఎఫ్ తరహాలో జెడ్పీపీఎఫ్‌ను మెరుగు పరచాలని కోరారు. జెడ్పీపీఎఫ్ నిర్వహణ లోపాల వల్ల పీఎఫ్ స్లిప్పులు అందుబాటులో లేవన్నారు. జిల్లాలో టీచర్లందరికీ సర్వీసు రెగ్యులరైజేషన్ విడుదల చేయడంలో విద్యాశాఖ నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్ రెడ్డి, మోహన్‌యాదవ్ మాట్లాడుతూ అకాల మరణం పొందిన ఉపాధ్యాయుల పిల్లలకు కారుణ్య నియామకాలు కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా అక్రమణలకు గురైన పాఠశాలల స్థలాలను సర్వే చేయించి రికార్డులను భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సత్వర చర్యలు చేపడతాం..

కలెక్టర్ స్పందిస్తూ అన్ని సమస్యల పరిష్కారానికి తాము చిత్తశుద్ధితో సత్వర చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. పీఎఫ్ ఖాతాల నిర్వహణలో లోపాలపై రాష్ట్ర ఉన్నతాధికారులతో ఫోన్‌లో అప్పటికప్పుడు చర్చించారు. విద్యాశాఖ నిర్లక్ష్యం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలల స్థలాలు అక్రమణలకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో సోమవారం జెడ్పీ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను వాయిదా వేస్తున్నట్లు ఎస్టీయూ చిత్తూరు జిల్లా శాఖ ప్రకటించింది. సమావేశంలో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ గ్లోరియా, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు పురుషోత్తం, దేవరాజులురెడ్డి, చంద్రన్, తదితరులు పాల్గొన్నారు.